క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు పరిశీలించిన కమిషనర్



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్క్ కొత్వాల్‌గూడలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ ఆర్.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ టార్గెట్‌ను పూర్తిచేయాలి



రెవెన్యూ బిల్లు కలెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లతో ఉప కమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రెవెన్యూ బిల్లు కలెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లతో ఉప కమిషనర్ రవికుమార్ శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ వసూళ్లను పెంచాలని ఆదేశించారు. రోజువారి, నెలవారి టార్గెట్‌ను ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ దరఖాస్తుల సర్వేలో సైతం పూర్తిస్థాయిలో పాల్గొనాలన్నారు.

విజ్ఞాన్ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ గౌరీసతీష్

బండ్లగూడ: బండ్లగూడలోని విజ్ఞాన్ కళాశాలలో విజ్ఞాన్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. సంక్రాంతి పండగ పురస్కరించుకొని విద్యార్థులు ఇంటి వద్దే పలు రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేసుకొని వచ్చారు. స్టాల్స్ ఏర్పాటు చేసి తోటి విద్యార్థులకు విక్రయించారు. కలెక్ట్ అయిన డబ్బులను అనాథ ఆశ్రమానికి ఇచ్చేందుకు విద్యార్థులు నిర్ణయించారు. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ గౌరీసతీష్ హాజరై విద్యార్థులను అభినందించారు.

శబరిమలకు స్వాములు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ఎర్రబోడ నుంచి మండల దీక్షను పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వాములు నాయిని వెంకటేష్ గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు బయలుదేరారు. ఎర్రబోడ గ్రామం సప్తగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి శుక్రవారం ఇరుముడులు కట్టుకొని స్వామి నామస్మరణతో బయలుదేరారు. సాయియాదవ్, కిరణ్‌చారి, రవీంద్రచారి, మనీంద్ర, హనుమంతు, హర్షిత్, ఎం.శ్రీధర్, రాహుల్, విజయ్‌మోహన్, ఎస్.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ కార్యాలయంలో కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ డివిజన్లలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీపై సమీక్షించారు. ఎల్‌ఆర్‌ఎస్ సర్వే, అడ్వటైజ్‌మెంట్ పన్నుల వసూలు, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్, ఆన్-అస్సెస్డ్, అండర్ అస్సెస్ట్ వసూలు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం, నూతన పనులపై చర్చించారు. వన మహోత్సవం కార్యక్రమంలో టార్గెట్ ప్రకారం నాటిన మొక్కల సంరక్షణ, నర్సరీ తదితర అంశాలపై అధికారులకు వివరించారు. వివిధ డివిజన్లలో నూతన వైర్ల ఏర్పాటు, రిపేరింగ్స్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడిన మంచిరేవుల శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం



భక్తి పాటలు ఆలపిస్తున్న మహిళలు



రాజేంద్రనగర్‌లో శ్రీవారిని దర్శించుకుంటున్న నాయకులు

వైకుంఠ ద్వారం.. మోక్ష మార్గం



శంషాబాద్ పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో..



రాజేంద్రనగర్‌లో స్వామి వారి సేవలో భక్తులు

- కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు
- శ్రీవారిని దర్శించుకున్న భక్తులు

మణికొండ: వైకుంఠంలో కొలువుదీరిన విష్ణుమూర్తిని ముక్కోటి దేవతలు ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకునే రోజును ముక్కోటి ఏకాదశి, వైకుంఠ ఏకాదశిగా పిలుస్తారు. వైకుంఠ ఏకాదశి రోజు శ్రీవారిని దేవతలతో పాటు ప్రజలు ఆలయాల్లో దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్మకం. శుక్రవారం వేకువజాము నుంచే పెద్దఎత్తున భక్తులు బారులుతీరి శ్రీనివాసుడిని దర్శించుకున్నారు. ఓయూ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి, పుప్పాలగూడ సెక్రటేరియట్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వామి, పంచవటి కాలనీలోని శ్రీరామాలయం, నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని అతిపురాతన శ్రీవేణుగోపాల స్వామి ఆలయాలు కిటకిటలాడాయి. మంచిరేవులలో మహిళల బృందం విష్ణుమూర్తి భక్తి పాటలతో అలరించారు. పలు ఆలయాల్లో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. శంషాబాద్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు పెద్దఎత్తున వైకుంఠ ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు.



ఓయూకాలనీలోని వేంకటేశ్వరస్వామి

మెడిటేషన్‌తో విద్యార్థులకు ఎంతో మేలు



మెడిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో 350 మంది విద్యార్థులకు మెడిటేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు ఫోకస్ పెంచడం, ఒత్తిడి తొలగించుకోవడం వంటివి నేర్చుకున్నారు. కార్యక్రమ నిర్వాహణకు బీజేవైఎం రాజేంద్రనగర్ వైస్ ప్రెసిడెంట్ వంశీ పుస్తకాల, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫ్యాకల్టీ సుహాస్‌రెడ్డి ముత్యాల, వెంకటేశ్, ఉపాసన, హరిప్రియ సహకారం అందించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ యతిపాటి శ్రీధర్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, బీజేవైఎం డివిజన్ వైస్ ప్రెసిడెంట్ వంశీ పుస్తకాల తదితరులు పాల్గొన్నారు.

శివపురి కాలనీలో రోడ్డు పనులు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ లావణ్యనరేష్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని శివపురి కాలనీలో సీసీ రోడ్డు పనులను 14వ వార్డు కౌన్సిలర్ యాలాల లావణ్యనరేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన వార్డు పరిధిలో అన్ని రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. శుక్రవారం ప్రారంభించిన రోడ్డు పనులను మున్సిపాలిటీ నిధులు రూ.40లక్షలతో చేపట్టామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టి వారి మన్ననలు పొందామన్నారు. అక్కడక్కడా మిగిలి ఉన్న కొన్ని పనులను మంజూరు చేయించామని, త్వరలోనే వాటిని పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

అవసరాల మేరకు నీటి సరఫరా పెంచండి



జలమండలి ఈడీకి మణికొండ నీటి సమస్యలపై వినతిపత్రం ఇచ్చిన నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ప్రజావసరాల మేరకు నీటి సరఫరా లేక పోవడం, ఒక్కరోజు సరఫరా నిలిచిపోతే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని, వెంటనే రిజర్వాయర్లు, ట్యాంకర్లను పెంచాలని బీఆర్‌ఎస్ మణికొండ మున్సిపాలిటీ నాయకులు జలమండలి అధికారికి శుక్రవారం విన్నవించారు. బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో జలమండలి కేంద్ర కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిత్తల్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజావసరాలకు తగ్గట్టుగా నీటి సరఫరా చేయకపోవడంతో చలికాలంలోనూ కొందరు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారన్నారు. పైనుంచి నీటి సరఫరా రెండు రోజులు నిలిచినా రిజర్వాయర్‌లలో నిలువ ఉండే నీటిని సరఫరా చేసేలా వ్యవస్థను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో ప్రజలకు నిత్యం నీటి సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఖిజ్రా కాలనీ, గోల్కొండ హిల్స్, నెక్నాంపూర్, నెమలినగర్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా పైప్‌లైన్లు వేయాలన్నారు. అలకాపూర్ స్పోర్ట్స్ పార్క్, కృష్ణారెడ్డినగర్‌లలో నిర్మించిన రిజర్వాయర్లను నిరుపయోగంగా ఉంచారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జలమండలి వారు ప్రజలకు డ్రైనేజీ నిర్వహణ చేయకున్నా పన్నులు మాత్రం దండుకుంటున్నారని, ఆ పన్ను తొలగించాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, జి.విఠల్, బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎ.కుమార్, ఆరీఫ్ మహమ్మద్, అష్ఫాక్ అలీ, సుమనళిని పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.43.71 కోట్లతో తీర్మానం

మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



మాట్లాడుతున్న చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి సమగ్ర అభివృద్ధికి కృషి చేశామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆయన అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, ముంపు ప్రాంతాల సమస్య పరిష్కరించడం, తాగునీటి పైప్‌లైన్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, పార్కులు, సర్కిల్ అభివృద్ధి వంటి పనులను చేశామన్నారు. ఈ నెల 25వ తేదీతో పదవీ కాలం పూర్తయినా నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. మిగిలి ఉన్న మరికొన్ని అభివృద్ధి పనులను చేపట్టేందుకు సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేయాలని కోరారు.

రూ.43.71 కోట్ల పనులకు తీర్మానం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో శుక్రవారం మొత్తం రూ.43.71కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో చేయాల్సిన పనుల వివరాలను కమిషనర్‌కు అందించడంతో వాటిని ఎజెండాలో పొందుపర్చడంతో సమావేశం సాఫీగా సాగింది. రూ.5.78 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించాలని, రూ.2.24 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించాలని, రూ.2.95 కోట్లతో కమ్యూనిటీ హాల్స్, మున్సిపల్ కార్యాలయం పనులు పూర్తి చేయాలని తీర్మానం చేశారు. విద్యుత్ పనుల గురించి రూ.55 లక్షలు, శ్మశానవాటికలో మిగిలిన పనులు పూర్తి చేసేందుకు రూ.36 లక్షలు, ప్రహరీగోడల నిర్మాణాలకు రూ.55 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు రూ.1.78 కోట్లు, ఇతర మరమ్మతులు, వార్డుల వారిగా పనులు చేపట్టేందుకు రూ.6.73 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు రూ.19.52 కోట్లు ఖర్చు చేయాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మేనేజర్ శ్రీధర్, డీఈ సాయిశివ, ఏఈ సంజయ్‌కుమార్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గాయపడ్డ కార్మికులకు అండగా ఉంటాం



కుప్పకూలిన భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ నిర్మాణ సంస్థలో గాయపడ్డ కార్మికులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని, నిర్మాణంలో సేఫ్టీ మెజర్‌మెంట్ చూసుకోకుండా, సరైన ఇంజినీరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్‌రావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. ఘటనా స్థలాన్ని సీపీఐ గండిపేట మండల కార్యదర్శి పి.స్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ మండల కార్యదర్శి బాబురావు, సత్తయ్య, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోడలి హత్య కేసులో అత్తకు రిమాండ్



తులసి

శంషాబాద్‌రూరల్: కోడలిని హత్య చేసిన కేసులో అత్త తులసిని పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామంజాపూర్ తండా నివాసి ముడావత్ సురేష్ భార్య దూలితో అత్త తులసికి తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో విసుగు చెందిన తులసి గతేడాది నవంబర్ 10వ తేదీన కల్లులో ఎలుకల మందు కలిపి కోడలికి తాగించింది. సాతంరాయి శివారులో దూలి మృతదేహాన్ని మట్టి కుప్పల్లో పూడ్చేసింది. మృతురాలి భర్త సురేష్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం తులసి ప్రవర్తనపై అనుమానం రావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ నెల 9న తులసిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేయడంతో హత్య విషయం వెలుగు చూసింది. ఈ మేరకు పోలీసులు ఆమెను కోర్టులో హాజరుపర్చారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నెక్నాంపూర్‌లో నాలా క్లీనింగ్ పనులు



నెక్నాంపూర్‌లో నాలా క్లీనింగ్ చేపట్టిన నిర్మాణ సంస్థ

మణికొండ: చెరువులో నుంచి మూసీనదిలోకి వెళ్లే వాగులో మట్టిని నింపి నీటికి అడ్డు వేయడాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రశ్నించడంతో శుక్రవారం క్లీనింగ్ పనులు చేపట్టారు. మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ చిన్న చెరువు నుంచి మూసీ నదిలోకి నీరు వెళ్తుంది. కాల్వ పక్కనే ఓ విల్లా ప్రాజెక్ట్ నిర్మాణం కొనసాగుతోంది. దాని ప్రహరీ గోడ నిర్మాణంలో భాగంగా వాగులో మట్టి పోసి అస్తవ్యస్తం చేశారు. ఇదే విషయాన్ని గురువారం నెక్నాంపూర్ చెరువు పరిశీలనకు వచ్చిన హైడ్రా కమిషనర్ స్థానిక ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరి వివరించారు. దాంతో ఆయన నిర్మాణ సంస్థ వారిని పిలిచి వాగులో ఉన్న మట్టిని వెంటనే తొలగించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం నాలా క్లీనింగ్ పనులను చేపట్టారు. దాంతో నీరు సాఫీగా వెళ్లేందుకు మార్గం సుగమం అయ్యిందని స్థానికులు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా..?

- గగన్‌పహాడ్ వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి
- రహదారిపై రాస్తారోకో నిర్వహించిన గ్రామస్తులు



మైలార్‌దేవ్‌పల్లి: బెంగళూరు జాతీయ రహదారి గగన్‌పహాడ్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గగన్‌పహాడ్ రోడ్డు దాటడానికి అండర్ పాస్ బ్రిడ్జి మంజూరై రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో గగన్‌పహాడ్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతూ మృతి చెందుతున్నారు. రెండేళ్లలో ఈ రోడ్డుపై పలువురు మృతి చెందగా పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. గగన్‌పహాడ్ బస్తీకి చెందిన సూరెడ్డి రవీందర్‌రెడ్డి అనే యువకుడు గురువారం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు విసుగు చెంది శుక్రవారం జాతీయ రహదారి గగన్‌పహాడ్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. దీంతో ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ విషయం తెలుసుకున్న శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ అక్కడకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. పలు రాజకీయ పార్టీల నాయకులు సరికొండ వెంకటేష్, శీలం తిరుపతిరెడ్డి, జోగి రవి, వి.నాగేష్, శ్రీధర్‌గౌడ్, రత్నం, బాబ్జీ, ప్రవీణ్, శీలం జగన్‌మోహన్‌రెడ్డి, గండయ్య, దేవుడు ఉన్నారు.

మైనర్ బాలికపై లైంగికదాడి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు



నర్సింగ్‌రావు



ఆలివేలు

రాజేంద్రనగర్: మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన సెక్యూరిటీ గార్డుతో పాటు సహకరించిన ఓ మహిళకు రాజేంద్రనగర్ స్పెషల్ పోక్సో కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం నగరానికి వలస వచ్చి రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద ఫుట్‌పాత్‌పై గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. రోడ్లపై బొమ్మలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. వీరి గుడిసె పక్కనే ఎం.ఆలివేలు(45) గుడిసె వేసుకొని స్థానికంగా బొమ్మలు అమ్ముతూ ఉండేది. 2019 ఏప్రిల్ 7వ తేదీన గుడిసె వద్ద మైనర్ బాలిక అయిన పెద్ద కుమార్తెను ఉంచి భార్యాభర్తలు చిన్న కుమార్తెను తీసుకొని బొమ్మలు విక్రయించేందుకు వెళ్లారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బొమ్మలు అమ్ముకొని మరుసటి రోజు ఉదయం గుడిసెకు చేరుకున్నారు. కుమార్తె నీరసంగా ఉండటంతో పాటు భయంగా ఉండటంతో తల్లి కుమార్తెను ప్రశ్నించింది. పక్క గుడిసెలో ఉండే ఆలివేలు తన గుడిసెలోకి పిలిచిందని, షేక్‌పేట్ ప్రాంతానికి చెందిన సెక్యూరిటీ గార్డు నర్సింగ్‌రావు(43) ఆలివేలు సహాయంతో తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు చెప్పింది. ఎవరికీ చెప్పవద్దని రూ.100లు ఇచ్చి బెదిరించినట్లు తెలిపింది. దీంతో భార్య ఈ విషయాన్ని భర్తకు తెలపడంతో వారు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించారు. సెక్యూరిటీ గార్డు నర్సింగ్‌రావుతో పాటు ఆలివేలుకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. బాధితురాలికి రూ.5 లక్షలు అందించాలని జడ్జి ఆదేశించారు.